ఆ లింకులు క్లిక్ చేయొద్దు

పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్స్

నమ్మి మోసపోతున్న జనం

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు ఈ సారి ఏకంగా పీఎం కిసాన్ పథకం పేరును వాడుకొని లింకులను పంపుతూ అమాయకులను మోసం చేస్తున్నారు. జనంలో ప్రసిద్ధికెక్కిన పథకం పేరును వాడుతూ ఏపీకే(అండ్రాయిడర్ ప్యాకేజీ కిట్) ఫైల్స్ పంపించి నిలువునా దోచుకుంటున్నారు. కాబట్టి అవగాహన లేకుండా ఫోన్లలో వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇటీవల ఒక నిరుద్యోగ యువకుడి క్రెడిట్ కార్డు నుంచి ఎటువంటి ఓటీపీలు రాకుండానే 1.7 లక్షలు మాయమయ్యాయి. ఇదంతా ఎలా జరిగిందని తన మొబైల్ ఫోన్‌ను పరిశీలిస్తుంటే అందులో పీఎం కిసాన్. ఏపీకే పేరుతో లింక్ డౌన్‌లోడ్ అయి ఉండడాన్ని గమనించాడు. ఆఫైల్ డౌన్‌లోడ్ కావడంతో తనకు తెలియకుండానే తన క్రెడిట్ కార్డులు ఉపయోగించి ఉంటారని, తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీలు కూడా సైబర్ నేరగాళ్లు పరిశీలించుకొని, వాటిని ఆ తరువాత తొలగించి ఉంటారని భావిస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలంటూ బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆ ఫైల్స్‌తో జాగ్రత్త

అండ్రాయిడ్ అపరేటింగ్ సిస్టమ్‌లో ఇన్‌స్టాలేషన్, సాఫ్ట్‌వేర్ అప్‌డేటట్లకు ఏపీఐ ఫార్మట్‌లలో ఫైల్స్‌ను ఉపయోగిస్తుంటారు. ఈ ఫైల్స్‌లలో కోడ్ రాస్తూ కావాల్సిన అప్‌డేట్స్ చేయడం చేయడంతో యూజర్ దానిని తన సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటాడు. అయితే దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకొని అందులో వైరస్‌తో కూడిన సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసి అమాయకులకు పంపిస్తున్నారు. తెలియని వాళ్లు ఈ ఫైల్స్‌ను క్లిక్ చేయడంతో వైరస్ ఆ ఫోన్లలో ఇన్‌స్టాల్ అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది అంతగా నమ్మదగిన ఫైల్ కాదు, ఇన్‌స్టాల్ చేసేటప్పుడు అపరేటింగ్ సిస్టమ్ అడుగుతుంది. అయితే కొందరు తెలిసి, మరికొందరు తెలియక ఈ ఫైల్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు.

ఫోన్‌నే హ్యాక్ చేయవచ్చు!

గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింక్స్‌లో వైరస్‌తో కూడి సాఫ్ట్‌వేర్‌ను పంపించి ఫోన్‌నే సైబర్‌నేరగాళ్లు హ్యాక్ చేసే అవకాశముంది. ఈ లింక్స్‌ను క్లిక్ చేయవద్దని పోలీసులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఈ ఫైల్స్‌ను పంపిస్తూ బ్యాంకు ఖాతాలతో పాటు సెల్‌ఫోన్‌లోని ఇతర ముఖ్యమైన డాటాను సైతం నేరగాళ్లు అపహరించే అవకాశాలున్నాయని పోలీసులు సూచిస్తున్నారు.

ఇలంబర్తి.. ఇవేం రూల్స్!

- ఆర్థిక సంక్షోభం అంటూనే ప్రైవేట్ సైన్యం
- ఇప్పటికే ఆంక్షల నడుమ ప్రజావాణి
- సెల్‌ఫోన్ సరెండర్ చేస్తేనే అర్జీదారులకు అనుమతి
- రోజూ వారీ సందర్శకులకు ప్రవేశ ద్వారం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ అడ్డుగోడ
- సవాలక్ష ప్రశ్నలు..రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేసుకున్నాకే లోనికి ఎంట్రీ
- తాజాగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 113 మంది నియమకానికి రంగం సిద్ధం
- పౌర సేవలందించే సంస్థలో మార్షల్స్‌కు ఏం పని అని కార్పొరేటర్ల విమర్శలు

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : ఆర్థిక సంక్షోభంలో ఉన్నామని చెప్పుకుంటున్న జీహెచ్ఎంసీ ...మరోవైపు అనవసరపు ఖర్చు విషయంలో ఏ మాత్రం తగ్గడం లేదు..ఉద్యోగుల నెలవారీ జీతభత్యాలకే అపసోపాలు పడుతున్న తరుణంలో ప్రైవేట్ సైన్యాన్ని దింపుతోంది...ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీల తరహాలో వ్యవహరిస్తున్నది. వాస్తవంగా కోటికి మంది జనాభాకు పైగా పౌర సేవలందించే జీహెచ్ఎంసీలో మార్షల్స్ అక్కర్లేదు...ఆరు నెలలకోసారి జరిగే జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో ఘర్షణ జరుగుతుందని భావించే సందర్భంలోనే మార్షల్స్ సేవలు అవసరం పడతాయి..కానీ ఏడాది రెండు సార్లు జరిగే కౌన్సిల్ సమావేశం పేరిట తాత్కాలికంగా మార్షల్స్‌ను తీసుకోకుండా..ఏడాది పొడవున శాశ్వతంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిన 10 మంది మార్షల్స్‌ను నియమించుకునేందుకు సిద్ధమైంది. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన మార్షల్స్, విజిలెన్స్ మేనేజర్స్, విజిలెన్స్ అసిస్టెంట్స్, రిసెప్షనిస్ట్‌లు కలిపి మొత్తం 38 మందిని నియమకాన్ని ఏజెన్సీ ద్వారా భర్తీ చేసేందుకు టెండర్ పిలిచారు. ఈ 38 మందికి గానూ ఏటా రూ. 1,34,19,900లు ఖర్చు చేయనుంది. దీనికి తోడుగా 75 మంది ప్రైవేట్ సెక్యూరిటీని నియమించనున్నారు. వీరికి ఏడాదికి రూ.1,94,86,350లు ఖర్చు చేస్తారు. ఏటా రూ. 3కోట్లకు పైగా ప్రైవేట్ సైన్యం పేరిట ఖజానాకు భారం మోపేందుకు మార్గం సుగమమం చేశారు. ఈ టెండర్ ప్రక్రియను ఈ నెల 27న ముగించి ఎజెన్సీని ఎంపిక చేసి వీరిని భర్తీ చేయనున్నారు. హైడ్రా ఏర్పాటుతో జీహెచ్ఎంసీ ఈవీడీఎం విభాగంలో పనిచేసిన సిబ్బంది అంతా హైడ్రాకే వెళ్లడం జరిగిందని, ప్రస్తుతం 57 మందితో నెట్టుకువస్తున్నామని అధికారులు సమాధానం చెబుతున్నారు. కొత్తగా 75 మంది సెక్యూరిటీ సిబ్బంది, 38 మంది విజిలెన్స్ విభాగంలో అవసరమని నిర్ణయించి ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంటున్నారు. మార్షల్స్ విషయంలో మాత్రం కార్పొరేషన్ అని మరిచి..కార్పొరేట్ తరహాలో భావించి ప్రొఫెషనల్‌గా ఉంటుందన్న సమాధానాలు అధికారుల నుంచి వస్తుండడం గమనార్హం. మొత్తంగా తమ అక్రమాలకు, పాలన పరమైన లోపాలను ఎత్తిచూపకుండా అడ్డుగోడగా ఉండేందుకే ఈ మార్షల్స్ నియమించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నయా రూల్స్‌పై ఇప్పటికే విమర్శలు

కమిషనర్ ఇలంబర్తి తనను కలిసేందుకు వచ్చిన వారికి నిబంధనలు ఆమలు చేస్తున్నారు..పీఏలో పోలీసు బలగాలను ఏర్పాటు చేసి ఆంక్షలు విధించారు..ప్రజాప్రతినిధులకు సైతం కేటాయించిన సమయంలోనే కలుస్తున్నారు..మరోవైపు సందర్శకుల ఎంట్రీని కఠినతరం చేశారు. ఎవరిని కలిసేందుకు వచ్చారు? ఏ పని? అంటూ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద సెక్యూరిటీ పెట్టి మరీ సందర్శకుల వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చిన తర్వాతనే వారిని లోనికి అనుమతిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఆంక్షల నడుమ నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తమ గోడును చెబుకుందామని వచ్చే అర్జీదారులు తొలుత కఠిన పరీక్షలు దాటాల్సిన తర్వాతనే ప్రజావాణి ప్రాంగణంలోకి వెళ్లాల్సిన దుస్థితి. అర్జీదారులు తొలుత తమ వెంట తెచ్చుకున్న సెల్‌ఫోన్‌ను డిపాజిట్ చేయాలి? ఆ తర్వాత టోకెన్ తీసుకున్న తర్వాతనే తమ సమస్యను చెప్పుకునేందుకు అనుమతి ఉంటుంది..ఈ విదానంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్న భద్రత దృష్ట్యా తప్పదని అధికారులు సెలవిస్తున్నారు. అంతేకాదు క్షేత్రస్థాయి పర్యటన చేయాలని బీజేపీ కార్పొరేటర్ ఒకరు కమిషనర్‌ను కలిసినప్పుడు కుదరని తేల్చి చెప్పడంతో సదరు కార్పొరేటర్ అవాక్కైన పరిస్థితి.. ముఖ్యంగా రోజూ వారీ విజిటర్స్‌కు కూడా కమిషనర్ కలవాలంటే తమ ఆదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమకాలు ఇవే

	సంఖ్య	ఏడాదికి ఖర్చు
మార్షల్స్	10	3510000.00
విజిలెన్స్ మేనేజర్స్	12	3931200.00
విజిలెన్స్ అసిస్టెంట్	10	2808000.00
రిసెప్షనిస్ట్	6	1684800.00
ఈపీఎఫ్		889200.00
ఎజెన్సీ 5శాతం కమిషన్		596700.00
మొత్తం	**38**	**1,34,19,900**

కాగా కొత్తగా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 75 మంది సెక్యూరిటీ గార్డులకు నియమించుకునేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఒక్కొక్కరికీ రూ.18200ల చొప్పున ఏడాదికి రూ.16380000లు ఈపీఎఫ్ రూపంలో రూ.1755000లు, ఈఎస్ఐ 3.25 శాతం చొప్పున రూ.532350లు, ఏజెన్సీ కమిషన్ రూ.819000లు కలిపి మొత్తం ఏటా రూ.1,94,86,350లు ఖర్చు చేయనున్నారు.

'భరోసా'లో వీడియో రికార్డింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ

భరోసా సెంటర్‌లో వీడియో రికార్డింగ్

మేడ్చల్, మార్చి 21 : మేడ్చల్‌లోని భరోసా కేంద్రంలో బాధితుల సౌకర్యార్థం కల్పించిన వీడియో రికార్డింగ్ సౌకర్యాన్ని శుక్రవారం డీసీపీ కోటిరెడ్డి మహిళా భద్రతా విభాగం డీసీపీ సృజనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాచారం, పోక్సో కేసుల్లో బాధితులకు సంబంధించిన కేసుల ట్రయల్ జరుగుతున్నప్పుడు గానీ, సాక్షం చెప్పే సమయంలో వారు కోర్టు వరకు వెళ్లే అవసరం లేకుండా ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. భరోసా కేంద్రాలు అత్యాచార, పోక్సో కేసుల బాధితులను అన్న విధాలుగా ఆదుకుంటున్నాయన్నారు. మహిళా భద్రతా విభాగం డీసీపీ సృజన మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్, మేడ్చల్ జోన్‌లకు సంబంధించిన బాధితుల కోసం మేడ్చల్ భరోసా కేంద్రం పని చేస్తుందని తెలిపారు. ఏసీపీలు శ్రీనివాస్ రెడ్డి, రాములు నాయక్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ కళ్యాణి, లీగల్ సపోర్ట్ రోజా, డి.ఐ సుధీర్ కృష్ణ, ఎస్సైలు అనిత, మన్మద్, అశోక్ పాల్గొన్నారు.

చిన్నారి మృతదేహంతో ఆందోళన చేస్తున్న కూలీలు

చిన్నారిపై దూసుకెళ్లిన వాహనం అక్కడికక్కడే మృతి

శంషాబాద్ రూరల్, మార్చి 21 నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద పనికి వచ్చిన మేస్త్రీ కూతురు ఆడుకుంటుండగా సదరు చిన్నారిపైకి టాటా ఏస్ వాహనం దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఊటుపల్లిదొడ్డిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మరికల్‌కు చెందిన శివశంకర్– రేణుక దంపతులు ఏడాదిన్నార పాప కీర్తిని తీసుకొని పని చేయడానికి వచిన్నట్లు తెలిపారు. శంషాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం పనులు చేపడుతున్నారు. కూలీలు పనులు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటుండగా అక్కడే ఆడుకుంటున్న చిన్నారిపైకి టాటా ఏస్ వాహనం ఎక్కించాడు. తీవ్ర గాయాలైన చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో కూలీలు,స్థానికులు ఆటో డ్రైవర్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకొని కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తోటి కూలీలు నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉస్మానియాలో దొంగల భయం

పార్క్ చేసిన వాహనాలు మాయం

సిటీబ్యూరో,మార్చి, (నమస్తే తెలంగాణ):నిత్యం 3వేల మంది ఔట్ పేషేంట్లు. సుమారు 1200 మంది ఇన్‌పేషేంట్లకు వైద్య సేవలందిస్తున్న పేదల పెద్దాసుపత్రి ఉస్మానియాలో దొంగల భయంతో బాధితులు బెంబేలెత్తుతున్నారు. వైద్యం కోసం వస్తే వాహనాలు మాయమైతున్నాయంటూ లబోదిబోమంటున్నారు. శుక్రవారం సైతం రోగిని పరామర్శించేందుకు వచ్చిన ఓ వ్యక్తి దోబీఘాట్ వద్ద పార్కింగ్ చేసి తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించకుండా పోయింది. ఇలా నిత్యం ఈ తరహా దొంగతనాలు జరగడంతో బాధితులు ఇబ్బందిపడుతున్నారు.

ఉస్మానియా ఆసుపత్రిలో మొత్తం 116 సీసీ కెమెరాలు ఉండగా, వాటిలో 110 పనిచేస్తున్నట్లు, మిగతా 6 రిపేరుకు గురయ్యాయని సిబ్బంది తెలపడం గమనార్హం. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణ చేసినా కూడా దొంగలు విచ్చలవిడిగా దొంగతనాలకు పాల్పడటం అనుమానాలకు తావిస్తోంది.

ఆన్‌లైన్‌లోనే టిక్కెట్లు కొనండి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు 3 వేల మందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్‌మోహన్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడారు. టాటా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఈ నెల 23న ప్రారంభమై మే 21 వరకు 9 మ్యాచ్‌లు జరుగనున్నాయన్నారు. స్టేడియంలో 39 వేల మంది సీటింగ్ సామర్థ్యం ఉందని, మ్యాచ్‌లకు టిక్కెట్లు ఆన్‌లైన్‌లోనే కొనాలని క్రికెట్ అభిమానులకు సూచించారు. స్టేడియం వద్ద టికెట్ల విక్రయం ఉండదని, దొరుకుతాయనే బావనతో ఇక్కడకు వచ్చి ఇబ్బందులు పడవద్దని ప్రజలకు సూచించారు. టిక్కెట్లు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వాళ్లే రావాలని, బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. మ్యాచ్ ప్రారంభానికి 3 గంటల ముందు గేట్లు తెరుస్తారని, టిక్కెట్లు ఉన్నవారు త్వరగా వచ్చి తమ సీట్లలో కూర్చోవాలని తద్వారా రద్దీ తగ్గి ప్రశాంతంగా ఉంటుందన్నారు.

శ్లోకలో విద్యార్థిని చితకబాదిన టీచర్

హయత్ నగర్, మార్చి 21: విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్ చితకబాదిన ఘటన హయత్‌నగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం జరిగింది. బాధిత విద్యార్థి తల్లిదండ్రుల వివరాల ప్రకారం... భాగ్యలత కాలనీలో శ్లోక స్కూలులో సాత్విక్ 8వ తరగతి చదువుతున్నాడు. అదే స్కూల్లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న పాష అనే టీచర్ సాత్విక్ విద్యార్థిని టార్గెట్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూ చితకబాదాడు. ఇదేమని విద్యార్థి తల్లిదండ్రులు నిలదీస్తే తెలుగులో మాట్లాడుతున్నాడని హెచ్చరించామని పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు స్కూల్ వద్దకు చేరుకొని విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూలు చైర్మన్ బిట్ల శ్రీనివాస్ రెడ్డి బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులకు నచ్చజెప్పడంతో అక్కడి నుండి వెళ్లిపోయారు.

కటకటాల్లో బెట్టింగ్ బ్యాచ్

ఎల్లారెడ్డి గూడలో పట్టుబడ్డ బెట్టింగ్‌ముఠా సభ్యులు

వెంగళరావునగర్, మార్చి 21 : బెట్టింగ్ బ్యాచ్ ను పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. ఆన్‌లైన్‌లో యూ ట్యూబ్ ఛానల్ క్రియేట్ చేసి బెట్టింగుల్లో లాభాలు అర్జించినట్లు ఫేక్ వీడియోలను క్రియేట్ చేసి అమాయకుల్ని ఆకర్షిస్తారు. ఈ బెట్టింగుల్లో లక్షలాది రూపాయలు కొల్లగొట్టే ఈ గ్యాంగ్‌ను ఎల్లారెడ్డి గూడలో సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, మధురానగర్ పోలీసులు కలిసి పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు చెందిన సోనులే శ్రీకాంత్(28), గుర్లే హరీశ్(29), గుర్లే సతీశ్(31) కుమార్, సోనులే తిరుపతి(29), ఆదె వినోద్(28) లు ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో కామన్ ఫ్రెండ్స్. వృత్తి రీత్యా కార్పెంటర్ పనులు చేసే వీరు ఎల్లారెడ్డిగూడ శ్రీ దివ్య ఎన్ క్లేవ్‌లో ఓ ఫ్లాట్ ను అద్దెకు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్, సట్టా, మట్కా దందా గ్యాంగ్ ను నిర్వహిస్తున్నారు. వాట్సాప్, ఫేస్ బుక్ ఐడీలు క్రియేట్ చేసి ఆన్ లైన్ లో యూ ట్యూబ్ ఛానల్ ద్వారా బెట్టింగ్‌లను ఆకర్షిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఒక్కొక్కరి నుంచి వెయ్యి రూపాయలను కలెక్ట్ చేస్తారు. అమాయకులకు అత్యాశ చూపి బెట్టింగ్ దందాలోకి దింపుతారు. తొలుత చిన్న మొత్తంలో బెట్టింగ్ ఆడించి వారికి లాభాలు చూపుతారు. పెద్దమొత్తంలో బెట్టింగ్ డబ్బులు పెట్టగానే వారిని మోసం చేసి వారి డబ్బును కాజేస్తారు. ఇలా లక్షలాది రూపాయలను బెట్టింగ్ రాయుళ్లు కొల్లగొట్టారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.50 లక్షలతో పాటు ట్యాబ్, మ్యాక్ బుక్,సట్టా, మట్కా చీటీలు, 18 సెల్ ఫోన్లు, రూ. 2,13 697 బెట్టింగ్ బ్యాంక్ అకౌంట్, 2 కలర్ ప్రింటర్లు స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్ కు తరలించారు.

సినిమా చూపించేస్తున్నారు..!

ప్రమోటర్స్, యాప్స్ నిర్వాహకులపై మరిన్ని కేసులు

ఆత్మహత్యల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిర్వాహకులే టార్గెట్‌గా పోలీస్ ఆపరేషన్

ఇందుకోసమే గంటలతరబడి ఇన్‌ఫ్లూయెన్సర్స్ విచారణ

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్లు, నిర్వాహకులకు పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పటివరకు పంజాగుట్ట పీఎస్‌లో విచారించిన ఇన్‌ఫ్లూయెన్సర్స్ నుంచి సేకరించిన సమాచారంతో మరి కొంతమందిపై కేసులు పెట్టే ఆలోచనలో ఉన్నారు. ఇందులో ప్రధానంగా యాప్స్ నిర్వాహకులతో పాటు, ఇంకొంతమంది ప్రమోటర్స్ కూడా ఉన్నట్లు సమాచారం. వీరికి సంబంధించిన వివరాలు కూడా పోలీసులు తీసుకున్నట్లు తెలిసింది. అయితే యాప్ నిర్వాహకులు తమపై కేసులు పెట్టడానికి వీలు లేకుండా అవసరమైన న్యాయసలహాలు తీసుకుంటున్నారంటూ తెలిసిన పోలీసులు వాటిని ఆత్మహత్యలకు కారకాలుగా చూపించే దిశగా అడుగులేస్తున్నారు. తెలంగాణలో ఒక సంవత్సర కాలంలో సుమారుగా 25 మంది వ్యక్తులు బెట్టింగ్‌యాప్స్ కారణంగా ఆత్మహత్యలు చేసుకున్నట్లుగా పోలీసులు ఆధారాలు సేకరించారు. అప్పట్లో నమోదైన కేసులను తెరమీదకు తీసుకొస్తున్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తూ ఆత్మహత్యలకు ప్రేరేపించింది బెట్టింగ్ యాప్సేనంటూ రుజువు చేసే కోణంలో ప్రణాళిక సిద్ధం చేశారు. ఆన్‌లైన్లో బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్యలు చేసుకున్న యువత వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

పాతకేసులు తోడుతున్నారు..!

ఒక్క హైదరాబాద్‌లోనే ఎనిమిది మంది ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. వీరందరి ఆత్మహత్యలకు సంబంధించి కేసులను వెలికితీసి ఏ యాప్స్ ద్వారా వీరు గేమ్ ఆడారో తెలుసుకునే పనిలో ఉన్నారు. ఆ తర్వాత ప్రమోటర్స్, నిర్వాహకులపై కేసులు పెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం. బెట్టింగ్ యాప్స్‌లో ఒరిజినల్ గేమ్స్ కంటే వర్చువల్ గేమ్స్‌కే ఎక్కువగా డిమాండ్ ఉంది. ఈ గేమ్స్‌లోనే ఎక్కువగా డబ్బులు కూడా పోగొట్టుకుంటున్నారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాదికాలంలో సుమారు వంద కోట్లకు పైగా యాప్స్‌లో జనం నష్టపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై ఎలాంటి అధికారికంగా సమాచారం ఇవ్వడం లేదు. మరోవైపు వర్చువల్ యాప్స్ నిర్వాహకులు, ప్రమోటర్స్ .. ఈ ఇద్దరిపై పోలీసులు దృష్టి పెట్టారు. విష్ణుప్రియ, టేస్టీ తేజా, రీతూ చౌదరిల విచారణలో ఎక్కువగా వీటి పైనే ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. ఈ వర్చువల్ యాప్స్ ద్వారానే అటు నిర్వాహకులకు, ఇటు ప్రమోటర్స్‌కు కూడా లక్షల రూపాయల ఆదాయం వస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

మాస్క్‌లతో ప్రమోటర్స్ ప్రచారం..!

బెట్టింగ్ యాప్స్‌పై తెలంగాణ పోలీసులు ఇంత సీరియస్‌గా స్టెప్స్ తీసుకుంటుంటే ప్రమోటర్స్ , నిర్వాహకులు వారి పని వారు చేసుకుపోతున్నారు. కొత్త పేర్లతో యువతే టార్గెట్‌గా యాప్స్‌ను తీసుకొస్తున్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఈ యాప్స్‌కు మరింత డిమాండ్ పెరుగుతుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. ఇందుకోసం ప్రమోటర్స్ మరో కొత్త రూపంలో తమ ప్రమోషన్స్ కంటిన్యూ చేస్తున్నారు. ముఖానికి మాస్క్‌లు వేసుకుని బెట్టింగ్‌యాప్స్‌పై ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో కొత్తకొత్త పేర్లతో ఐడిలు , గ్రూపులు క్రియేట్ చేసి వాటి ద్వారా జనాన్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లుగా పోలీసుల విచారణలో ఇన్‌ఫ్లుయన్సర్లు చెప్పినట్లు సమాచారం. అయితే వీటి ద్వారా వచ్చే ఆదాయం విషయంలో పోలీసులు పూర్తి వివరాలు సేకరించారు. ఒక్కొక్కరిని గంటల తరబడి పీఎస్‌లో కూర్చోబెట్టి విచారించారు. వారు విచారించిన కాలం కొంత సేపే అయినా ఎక్కువ సేపు పిఎస్‌లో ఉంచుకుంటున్నారంటూ ప్రమోటర్స్‌కు సంబంధించిన గ్రూపులో చర్చిస్తున్నారు. ఆ తర్వాత వాట్సప్ చాట్‌ను వెంటనే డిలీట్ చేస్తున్నారు. బిగ్‌బాస్ కంటెస్టెంట్స్ అంతా తమ గ్రూపులో ఇకపై బెట్టింగ్ యాప్స్ లీగల్ అయినా, ఇల్లీగల్ అయినా ప్రమోట్ చేయవద్దని తీర్మానం చేసుకున్నట్లు సమాచారం. బెట్టింగ్‌యాప్ నిర్వాహకులు మాత్రం ఏ మాత్రం తగ్గకుండా ఐపిఎల్ టార్గెట్‌గా తమ యాప్స్ ప్రమోషన్‌ను కంటిన్యూ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారముంది. దీనిపై కేవలం ఆత్మహత్యలు కారణంగా చూపి వారిపై కూడా కేసులు పెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

ఆస్తిపన్ను చెల్లించని వియా మిలానో పబ్ సీజ్

బంజారాహిల్స్, మార్చి 21: ఆస్తి పన్ను చెల్లించకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న సంస్థలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. రూ.31 లక్షల ఆస్తిపన్ను బకాయి కలిగి ఉన్న జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 లోని వియామిలానో పబ్ ను జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. గతంలో పబ్ నిర్వాహకులు రెండుసార్లు బకాయిల చెల్లింపు కోసం ఇచ్చిన చెక్కులు బాండ్స్ కావడంతో రెండు నోటీసులు అందజేశారు. నోటీసులకు స్పందించకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగి పబ్ సీజ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 లోని షాంగ్రిల్లా ప్లాజా భవనానికి సంబంధించిన ఆస్తిపన్ను బకాయి రూ 1.27 కోట్లు ఉండడంతో భవనాన్ని సీజ్ చేసేందుకు అధికారులు శుక్రవారం చేరుకున్నారు. భవనాన్ని సీజ్ చేయాల్సి ఉంటుందని నిర్వాహకులకు తెలిపారు. రాత్రిలోగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లిస్తామని చివరి అవకాశం ఇవ్వాలంటూ కోరడంతో అధికారులు వెనుతిరిగారు.

బాలికపై లైంగికదాడి కేసులో 25 ఏండ్ల జైలు

బాధితురాలికి రూ.7 లక్షల నష్టపరిహారం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : నల్లకుంట పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన ఓ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడు రాజనాల రమేష్ అలియాస్ వెంకటేష్‌కు 25 ఏండ్ల జైలుశిక్షతోపాటు 5వేల జరిమానా విధిస్తూ పోక్సోకోర్టు జడ్జి టి.అనిత శుక్రవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరునెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బాలికకు రూ.7లక్షల నష్టపరిహారం అందించాలని న్యాయ సేవాధికార సంస్థకు సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్‌రెడ్డి కథనం ప్రకారం కాచిగూడ బస్‌స్టాప్ పక్కన నివసిస్తున్న బాలికను కిడ్నాప్ చేసి రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న స్ట్రీట్ నెం.4 ప్రాంతంలో లైంగిక దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు దారుడి సమాచారం మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. బాలిక అరుపులకు సదరు ప్రాంతానికి చేరుకున్న ఫిర్యాదు దారుడు 100 డయల్ చేయడంతో ఘటన ప్రాంతానికి చేరుకునే సమయానికి నిందితుడు అక్కడినుంచి పారిపోయాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని పట్టుకుని విచారించి రిమాండ్‌కు తరలించిన పోలీసులు ప